# DC తెలుగు
## దక్కన్ డిజిటల్ మీడియా



డీసీ తెలుగు డిజిటల్ దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | శనివారం 26 అక్టోబర్ 2024 | Digital paper


### ఆరోగ్య సమస్యలుంటే నడక
# మార్గంలో రావొద్దు

- గుండె సంబంధిత వ్యాధులుంటే జాగ్రత్త
- నడక మార్గ భక్తులకు టిటిడి ముందస్తు హెచ్చరిక



**తిరుపతి, అక్టోబర్25 :** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి ప్రతీరోజూ వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. శ్రీవారిని నడకమార్గంలో వెళ్లి దర్శించుకునే భక్తుల సంఖ్య కూడా పెద్ద సంఖ్యలో ఉంటుంది. అయితే గుండె సంబంధిత సమస్యలు, పలు అనారోగ్య సమస్యలు ఉన్న వారు నడకమార్గంలో వెళ్లడం వల్ల ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇలాంటి వారి కోసమే టిటిడి కీలక సూచనలు


➢ మిగతా 2వ పేజిలో..


### సోమశిల నుంచి శ్రీశైలం వరకు
# లాంచీ ప్రయాణం

- నేటినుంచి అందుబాటు లోకి విహార యాత్ర




### ఉచిత ఇసుక పాలసీ
# ఉత్తర్వులు జారీ

- కేబినేట్ నిర్ణయానికి అనుగుణంగా ఆదేశాలు
- ఇంటి నిర్మాణాలకు ఉచితంగా సరఫరా..
- పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలకు ఆదేశం

**అమరావతి, అక్టోబర్25 :** ఏపీలో ఉచిత ఇసుక పాలసీ- 2024లో సీనరేజ్ ఛార్జిని మాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా జీవోను విడుదల చేశారు. ఉచిత ఇసుక పాలసీపై ఈ నెల 21న జరిగిన కేబినేట్ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీంతో, ఎటువంటి రుసుం చెల్లించకుండానే నిర్మాణ అవసరాలకు ఇసుకను తీసుకువెళ్లేలా ఆదేశాల్లో పేర్కొంది. నిర్మాణ రంగం వల్ల ఉపాధి ఆదాయం పెరుగుతున్నందున ఉచిత ఇసుక పూర్తిస్థాయిలో అమలుకు చర్యలు చేపట్టిన్నట్లు జీవోలో పేర్కొంది. దీనిలో భాగంగా సీనరేజ్ ఫీజు, మెరిట్ అన్ శాండ్, డీఎంఎఫ్ మాఫీకి చర్యలు చేపట్టినట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. స్థానికంగా ఇసుక లభ్యత రవాణా పెరుగుతుందని ప్రభుత్వం తెలిపింది. ఇసుక బ్లాక్ మార్కెటింగ్‌ను నివారించేలా విజిలెన్స్‌ను సైతం పటిష్టం చేయాలని నిర్ణయించింది. ఇసుక లభ్యతను పెంచేలా ప్రస్తుత ఇసుక పాలసీలో మార్పులు, చేర్పులు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఉచిత ఇసుకపై ఉన్న పన్నులు, స్వయంగా ఇసుక తవ్వకం, తరలింపు, ఇసుక లభ్యం కాని జిల్లాల్లో స్టాక్ యార్డులు ఏర్పాటు చేయాలని సూచించింది. విజిలెన్స్ మానిటరింగ్‌పై విధివిధానాలను మార్పులు చేసింది. ఇసుక అక్రమంగా తరలిపోకుండా జీపీఎస్, చెక్ పోస్టుల వద్ద


➢ మిగతా 2వ పేజిలో..




### వైఎస్ అభిమానులకు
# షర్మిల సంచలన లేఖ

- మూడు పేజీల్లో కుటంబ వ్యవహారాలపై వివరణ
- జగన్ ఆస్తి పంపకాల్లో చేసిన మోసాలపై ఏకరువు
- సొంత పత్రికలో తప్పుడు వార్తలతో లేక రాసానని వెల్లడి



**విజయవాడ, అక్టోబర్25 :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల.. వైఎస్ఆర్ అభిమానులకు సంచలన లేఖ రాశారు. 3 పేజీల బహిరంగ లేఖ రాసిన ఆమె.. అందులో సంచలన విషయాలు వెల్లడించారు. సాక్షి పేపర్, ఛానెల్‌లో తనపై ప్రసారం చేస్తున్న వార్తలపై స్పష్టతను ఇస్తూ.. ఇవీ వాస్తవాలంటూ కీలక వివరాలను వెల్లడించారు. వైఎస్ అభిమానులకు వాస్తవాలు తెలియజేసే ప్రయత్నంలో భాగంగానే ఈ లేఖ రాసినట్లు పేర్కొన్నారు. 'ఈరోజు పొద్దున సాక్షి పేపర్ చూశాను. సాక్షి మీడియా జగన్ మోహన్ రెడ్డి చేతిలో ఉంది. కాబట్టి ఏదైనా నమ్మించగలరు. అయినా వైఎస్సార్ అభిమానులకు అసలు వాస్తవాలు తెలియజేసే ప్రయత్నం నాది. అమ్మ వైఎస్ విజయమ్మ, నాన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి గురించి ఒక పుస్తకం రాశారు. అందులో నాన్న గురించి ప్రత్యేకంగా ఒక మాట రాశారు. 'రాజశేఖర్ రెడ్డి గారికి లోకం అంతా ఒకెత్తయితే.. తన బిడ్డ షర్మిల ఒకెత్తు అని రాశారు. నాన్నకు నేనంటే ప్రాణం. నాన్న నన్ను ఎప్పుడూ ఆడపిల్ల కదా అని చిన్న చేసో, తక్కువ చేసో చూడలేదు. నాన్న బతికి ఉన్నన్ని రోజులూ ఒకే మాట అనేవారు. 'నా' నలుగురు గ్రాండ్ చిల్డ్రన్ నాకు సమానం. వైఎస్సార్ బతికి ఉండగా స్థాపించిన అన్ని కుటుంబ వ్యాపారాల్లో నలుగురు గ్రాండ్ చిల్డ్రన్ కూ సమాన వాటా ఉండాలి. రాజశేఖర్ రెడ్డి ఉండగా స్థాపించిన అన్ని వ్యాపారాలు కుటుంబ వ్యాపారాలే. అవి జగన్ మోహన్ రెడ్డి సొంతం కాదు. ఉన్న అన్ని కుటుంబ వ్యాపారాలకు జగన్ 'గార్డియన్' మాత్రమే. అన్ని వ్యాపారాలు నలుగురు చిన్న బిడ్డలకు సమానంగా పంచి పెట్టాల్సిన బాధ్యత ఆయనదే. ఇది రాజశేఖర్ రెడ్డి మ్యాండేట్. వైఎస్సార్ ఈ ఉద్దేశం ఆయన బిడ్డలమైన మాకు, ఆయన భార్యకు, కేవీపీ రామచంద్రరావు, వైవీ సుబ్బారెడ్డి, విజయ సాయిరెడ్డి సహా సన్నిహితులందరికీ స్పష్టంగా తెలుసు. నాన్న బతికి ఉండగా స్థాపించిన అన్ని వ్యాపారాల్లో సరస్వతి, భారతి సిమెంట్స్, సాక్షి మీడియా, క్లాసిక్ రియాలిటీ, యలహంక ప్రాపర్టీ, ఇలాంటివి ఏమైనా.. నలుగురు గ్రాండ్ చిల్డ్రన్ కు సమాన వాటా ఉండాలన్నది వైఎస్ఆర్ మ్యాండేట్. ఒక్క సండూర్ మినహా రాజశేఖర్ రెడ్డి బతికున్నంత వరకు ఏ ఒక్క ఆస్తి పంపకం కూడా జరగలేదు. వైఎస్సార్ హఠాత్తుగా మరణించారు. తర్వాత కూడా ఏ ఆస్తి పంపకాలు జరగలేదు. ఈరోజు వరకు నాకు న్యాయంగా రావాల్సిన ఒక్క ఆస్తి కూడా నా చేతుల్లో లేదు. స్వార్జితం అని జగన్ మోహన్ రెడ్డి చెబుతున్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులే. రాజశేఖర్ రెడ్డి బతికి ఉన్నప్పుడే ఆస్తులు పంపిణీ చేశారనేది అవాస్తవం. ఈరోజు సాక్షిలో చూపినట్లుగా మా తాతల ఆస్తి చిన్నప్పుడే నా పేరు మీద పెట్టినంత మాత్రాన, అది నాన్న నాకు పంచిన ఆస్తి కాదు. ఇతరులతో


➢ మిగతా 2వ పేజిలో..


### సాగునీటి ప్రాజెక్టుల్లో
# అత్యవసరపనులు

- ప్రాజెక్టుల నిర్వహణ కోసం రూ.983 కోట్లు ..
- విడుదలకు సిఎం చంద్రబాబు అంగీకారం.. అధికారులతో మంత్రి నిమ్మల సమీక్ష

**విజయవాడ, అక్టోబర్25 :** రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, కాలువల్లో అత్యవసర పనులను చేపట్టాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల సీఈ, ఎస్ఈలతో విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, కాలువల అత్యవసర పనుల నిర్వహణకు సీఎం చంద్రబాబు విడుదల చేసిన రూ.284 కోట్లతో.. ఆ పనులను చేపట్టాలని అధికారులకు సూచించారు. జగన్ పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల గేట్లు, షట్టర్లు, రోప్స్ వంటివి నిర్వహణ సరిగా లేక నిర్వీర్యంగా మారాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్ట్‌ల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన 2,323 పనులకు వెంటనే టెండర్లు పిలిచి, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. సాగు నీటి ప్రాజెక్టుల ఆపరేషన్, నిర్వహణ కోసం ఏటా రూ.983 కోట్లు ఖర్చు చేయాల్సిఉండగా, గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం రూ.275 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని అధికారులు మంత్రికి వివరించారు. ఈ సమావేశానికి ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి. సాయిప్రసాద్, ఈఎన్సీ ఎం. వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్టులు , రిజర్వాయర్లు, కాలువల అత్యవసర పనుల నిర్వహణకు ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేసిన రూ. 284 కోట్లతో వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. ఏపీవ్యాప్తంగా ప్రాజెక్ట్‌లలో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులకు వెంటనే టెండర్లు పిలిచి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టుల ఆపరేషన్, నిర్వహణ కోసం ప్రతి సంవత్సరం రూ.983 కోట్లు ఖర్చు పెట్టాల్సిఉండగా, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం రూ.275 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని అధికారులు తెలిపారు. ఏడాదికి అవసరమైన రూ. 983 కోట్లు ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు


➢ మిగతా 2వ పేజిలో..


# సిజెఐగా జస్టిస్ ఖన్నా 11న ప్రమాణం

- ఆరు నెలలపాటు పదవిలో కొనసాగున్న ఖన్నా

**న్యూఢిల్లీ, అక్టోబర్25 :** భారత సుప్రీం తదుపరి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నియామకానికి కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఆమోదం తెలిపింది. ఆయన ఈ నెల 11న బాధ్యతలు చేపడతారు. కేవలంఆరు నెలలు మాత్రమే పదవిలో కొనసాగుతారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయమూర్తిగా పనిచేస్తున్న


➢ మిగతా 2వ పేజిలో..

### ఆరోగ్య సమస్యలుంటే నడక

## మార్గంలో రావొద్దు

మొదటిపేజీ తరువాయి.. చేసింది. 60 ఏళ్లు దాటిన వృద్ధులు, మధుమేహం, అధిక రక్తపోటు, ఉబ్బసం, మూర్ఛ, కీళ్ల వ్యాధులు ఉన్న భక్తులు తిరుమలకు కాలినడకన రావడం మంచిది కాదు. ఊబకాయంతో బాధపడుతున్న భక్తులు, గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు తిరుమల కొండకు నడక దారిన రావడం శ్రేయస్కరం కాదు. తిరుమల కొండ సముద్ర మట్టానికి చాలా ఎత్తులో ఉండటం కారణంగా ఆక్సిజన్ స్థాయి తక్కువగా ఉంటుంది. కాలినడకన రావడం చాలా ఒత్తిడితో కూడుకున్నది.. కాబట్టి గుండె సంబంధిత వ్యాధులు, ఉబ్బస వ్యాధిని తీవ్రతరం చేసే అవకాశం ఉంది.. కనుక భక్తులు తదనగుణంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న భక్తులు వారి రోజువారి మందులు వెంట తెచ్చుకోవడం ద్వారా సమస్యలను నివారించవచ్చు. కాలినడకన వచ్చే భక్తులకు ఏమైనా సమస్యలు ఎదురైతే అలిపిరి కాలిబాట మార్గంలోని 1500 మెట్టు, గాలి గోపురం, భాష్యకార్ల సన్నిధి వద్ద వైద్య సహాయం పొందవచ్చు. తిరుమలలోని ఆశ్విని ఆసుపత్రి, ఇతర వైద్యశాలల్లో నిరంతర వైద్య సదుపాయం పొందవచ్చు. దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అత్యవసర పరిస్థితుల్లో తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో దయాలసిస్ సౌకర్యం అందుబాటులో ఉంది. తిరుమలకు కాలినడకన రాదలచిన భక్తులు పై సూచనలను తప్పనిసరిగా పాటించాలని.. తమకు సహకరించాలని ఓ ప్రకటనలో టిటిడి విజ్ఞప్తి చేసింది.

## సిజెఐగా జస్టిస్ ఖన్నా 11న ప్రమాణం

మొదటిపేజీ తరువాయి.. జస్టిస్ ఖన్నా, ప్రస్తుత సిజెఐ చంద్రచూడ్ పదవీ విరమణ తర్వాత నవంబర్ 11న ఆ పదవిని చేపట్టనున్నారు. జస్టిస్ చంద్రచూడ్ ఇప్పటికే జస్టిస్ ఖన్నా పేరును తుదిపరి ప్రధాన న్యాయమూర్తి పదవికి సిఫార్సు చేశారు. ప్రస్తుత న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ 65 ఏళ్ల వయసులో పదవీ విరమణ చేసిన ఒక రోజు తర్వాత, నవంబర్ 11న జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జస్టిస్ చంద్రచూడ్ నవంబర్ 8, 2022న సీజేఐగా బాధ్యతలు స్వీకరించారు. జస్టిస్ ఖన్నా నియామకానికి ప్రభుత్వ ఆమోదాన్ని ధృవీకరిస్తూ, కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ఎక్స్ ద్వారా ఈ విషయాన్ని ప్రకటించారు. జస్టిస్ ఖన్నా 183 రోజులు మాత్రమే సీజేఐ ఉండనున్నారు. అంటే ఆయన కేవలం ఆరు నెలలు మాత్రమే ఈ పదవిలో ఉంటారన్నమాట. అతను మే 13, 2025న పదవీ విరమణ చేయనున్నారు. మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి హన్స్ రాజ్ ఖన్నా మేనల్లుడు జస్టిస్ సంజీవ్ ఖన్నా జబల్‌పూర్ కేసులో ఇచ్చిన తీర్పుతో ఆయన ప్రసిద్ధి చెందాడు.

## చంచల్‌గూడ నుంచి జానీ మాస్టర్ విడుదల

### లైంగిక వేధింపులు, పోక్సో కేసులో నిందితుడు

**హైదరాబాద్, అక్టోబర్25 :**
అసిస్టెంట్ మహిళా కొరియోగ్రాఫర్‌పై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కుంటున్న ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ శుక్రవారంచంచల్ గూడ జైలు నుంచి బెయిల్‌పై విడుదల అయ్యారు. హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో చంచల్ గూడ జైలు నుంచి బయటకు వచ్చారు. 36 రోజులు పాటు ఆయన చంచల్ గూడ జైల్లో ఉన్నారు. లైంగిక వేధింపులు, పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న జానీ మాస్టర్‌ను రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు గోవాలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గోవా స్థానిక కోర్టులో ప్రవేశపెట్టి పీటీ వారెంట్ తీసుకుని.. హైదరాబాద్ తీసుకువచ్చారు. జానీ మాస్టర్‌పై రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో లైంగిక వేధింపులకు సంబంధించి జీరో ఎఫ్ఐఆర్ కాగా, అదే రోజున నార్సింగ్ పోలీసులు మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం బాధితురాలి వాంగ్మూలాన్ని సేకరించారు. తనపై జానీ మాస్టర్ లైంగిక దాడికి పాల్పడ్డట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను మిన్నకుండిపోవడాన్ని అవకాశంగా తీసుకుని, తరచూ షూటింగ్ ప్రదేశాల్లో వేధించేవాడని.. వ్యానిటీ వ్యాన్‌లో తన కోరిక తీర్చాలంటూ బలవంతపెట్టేవాడని వివరించారు. ఒప్పుకోకుంటే తన జుట్టు పట్టుకుని దాడి చేసేవాడని.. ఓ సందర్భంలో అద్దంతో నా ముఖంపై కొట్టాడని వాపోయారు. మాట వినకపోతే.. షూటింగ్ లొకేషన్‌లో అందరి ముందు అవమానపరిచేవాడని, అసభ్యంగా తాకేవాడని తెలిపారు. మతం మారి, తనను పెళ్లి చేసుకోవాలని హింసించేవాడని చెప్పారు. జానీ మాస్టర్ వేధింపులు పెరగడంతో.. తాను సొంతంగా పనిచేయడం ప్రారంభించినట్లు బాధితురాలు పోలీసులకు తెలిపారు.

## నటుడు అల్లు అర్జున్‌కు ఏపీ హైకోర్టులో ఊరట

### నవంబర్ 6 వరకు తదుపరి చర్యలపై స్టే

**అమరావతి, అక్టోబర్25 :** ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ కు ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారనే కారణంతో నంద్యాల పోలీసులు అల్లు అర్జున్ పై కేసు నమోదు చేశారు. తమపై నమోదు చేసిన కేసులను కొట్టేయాలంటూ అర్జున్, మాజీ ఎమ్మెల్యే రవిచంద్రకిశోర్‌రెడ్డి వేసిన వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరిపింది. ఎఫ్ఐఆర్ ఆధారంగా నవంబరు 6 వరకు తదుపరి చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం ఆదేశించింది. నవంబరు 6న తగిన ఉత్తర్వులిస్తామని హైకోర్టు తెలిపింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో నంద్యాల వైకాపా అసెంబ్లీ అభ్యర్థి శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఇంటికి అల్లుఅర్జున్ వచ్చారు. వైకాపా శ్రేణులు పట్టణ శివారు నుంచే భారీ వాహనాలు, మోటారు సైకిళ్లతో ప్రదర్శనగా పట్టణంలోకి ఆయన్ను తీసుకువచ్చాయి. ఆయన పర్యటనకు అధికారిక అనుమతులూ లేకపోయినా పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈ విషయాన్ని కొందరు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అల్లు అర్జున్, శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డిలపై అప్పట్లో నంద్యాల రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

## ప్రజావాణికి మొత్తం 509 దరఖాస్తులు

**హైదరాబాద్, అక్టోబర్25 :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 509 దరఖాస్తులు అందాయి. మైనారిటీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 200, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 76, విద్యుత్ శాఖ కు సంబంధించి 57, పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 35, ప్రవాసీ ప్రజావాణి ద్వారా 5, ఇతర శాఖలకు సంబంధించి 136 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి శ్రీమతి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

# వైఎస్ అభిమానులకు షర్మిల సంచలన లేఖ

మొదటిపేజీ తరువాయి..

**మొదటి పేజీ తరువాయి..** ఒక వ్యాపారంలో చిన్న భాగం నా పేరు మీద పెడితే అది ఆస్తి పంచి ఇచ్చినట్లు కాదు. ఆస్తి పంచడం అంటే ఇవిగో ఈ ఆస్తులు.. నీకు ఇక ఇంతే అని మా నాన్న నాకు చెప్పి ఉంటే అది ఆస్తి పంచేయడమంటే..! నేను జగన్ మోహన్ రెడ్డి ఆస్తుల్లో వాటా అడుగుతున్నాను అనేది హాస్యాస్పదం. ఇవన్నీ కుటుంబ ఆస్తులు కనుక రాజశేఖర్ రెడ్డి నలుగురు చిన్న బిడ్డలకు సమానంగా పంచాలి అనుకున్నారు. కాబట్టే ఈ రోజు వరకు వీటి గురించి మాట్లాడుతున్నాం. నాకంటూ వ్యక్తిగతంగా ఈ ఆస్తులపై మోజు లేదు. వీళ్లు పెట్టిన హింసలకు ఈ ఆస్తులు కావాలనే కోరిక కూడా లేదు. కేవలం నా బిడ్డలకు ఈ ఆస్తులు చెందాలి అనేది రాజశేఖర్ రెడ్డి అభిమతం గనుక.. ఈ రోజు వరకు కూడా అమ్మైనా, నేనైనా తపన పడుతున్నాం. ఇప్పటికీ అమ్మ వెయ్యి సార్లు వీళ్లను అడిగి ఉంటుంది. వందల కొద్దీ లేఖలు రాసి ఉంటుంది. అయినా నా బిడ్డలకు చెందాల్సిన ఆస్తిలో ఒక్కటి కూడా ఇవ్వలేదు. రాజశేఖర్ రెడ్డి చనిపోయిన తర్వాత 10 ఏళ్లు జగన్ ఇబ్బందులు పడితే, అవి నా ఇబ్బందులు అనుకొని.. నా శక్తికి మించిన సాయం చేశాను. తోడబుట్టిన వాడికోసం నా బిడ్డలను సైతం పక్కనపెట్టి ఆయన్ను, ఆయన పార్టీని ఏ స్వార్థం లేకుండా నా భుజాల మీద మోశాను. ఆ 10 ఏళ్లు నా అవసరం ఉంది అనుకున్నారో.. ఏమో.. నన్ను బాగానే చూశారు. పెద్ద కూతురు అన్నారు. రాజశేఖర్ రెడ్డి ఊహించినట్లుగానే గ్రాండ్ చిల్డ్రన్ నలుగురు సమానం అన్నట్లుగానే వ్యవహరించారు. ఆ 10 ఏళ్లలో రూ. 200 కోట్లు ఇచ్చామని చెప్తున్నది ఇందులో భాగంగానే. ఆ 10 ఏళ్లు నా బిడ్డలకు సమాన వాటా ఉందని గుర్తిస్తూ.. కంపెనీలోని డివిడెండ్‌లో సగం వాటా నాకు ఇవ్వడమే ఈ రూ. 200 కోట్లు. వాళ్లు చేసింది ఉపకారం కాదు. ప్రేమతో ఇచ్చింది అంతకంటే కాదు. నాకు సమాన వాటా ఉంది కాబట్టి డివిడెండ్‌లో సగం వాటా ఇచ్చారు. అది కూడా అప్పుగా చూపించమన్నారు. సీఎం కాగానే జగన్ గుర్తుపట్టలేనంతగా మారిపోయారు. నాపై చిన్నచూపే కాదు.. సీఎం కాగానే విడిపోదామని ప్రతిపాదించారు. విడిపోవద్దని అమ్మ, నేను చెప్పాం. ఆస్తులు పంచుకుందామని విజయవాడకు రమ్మన్నారు. భారతి సిమెంట్స్, సాక్షిలో ఎక్కువ వాటా కావాలని అడిగారు. 60 శాతం తీసుకుంటా.. 40 శాతం ఇస్తా అని జగన్ ప్రతిపాదించారు. ఆ తర్వాత అరగంటలో ఆస్తుల వాటా తేలిపోయింది. కొద్ది వారాల్లోనే ఎంవోయూ కూడా తయారైంది. నాకు రావాల్సిన వాటా ఇచ్చారు తప్పితే.. ప్రేమాభిమానాలతో కాదు. 2021లో నేను రాజకీయాల్లో అడుగుపెట్టా. జగన్‌కు ఇష్టం లేకుండా వచ్చానని కోపమొచ్చింది. రాజకీయాల్లో నన్ను అణచి వేసేందుకు ఆయన చేయని ప్రయత్నం లేదు. ఆంధ్రాలో కాంగ్రెస్ తరఫున ప్రచారం చేస్తే అవమానించారు. సోషల్ మీడియాలో నాపై వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. నన్నే కాదు.. వివేకాపైనా సాక్షి మీడియాలో అసభ్యకరంగా ప్రచురించారు. ఎన్నికల్లో ఓటమికి నేనే కారణమని బలంగా నమ్మారు. విరోధం వద్దు.. మాట్లాడుకుందామని బంధువులను పంపారు. జగన్, భారతి, అవినాష్‌కు వ్యతిరేకంగా మాట్లాడొద్దని షరతు పెట్టారు. బంధువులు ఎంత ఒత్తిడి చేసినా ఆ షరతులకు నేను ఒప్పుకోలేదు. అదే కోపంతో మళ్లీ నాతో పాటు అమ్మపై ఎన్‌సీఎల్‌టీలో కేసు వేశారు. మేం మోసం చేసి షేర్లు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రజల్లో అమ్మపై కేసు వేసిన దుర్మార్గుడనే పేరు వస్తుందని మాట మార్చారు. జగన్ బెయిల్ రద్దుకు కుట్ర చేస్తున్నామనే అభియోగం మోపారు. నిజానికి బెయిల్ రద్దు కాదు.. ఎందుకంటే సరస్వతి షేర్స్ అటాచ్ కాలేదు. కంపెనీల్లో ఈడీ అటాచ్ చేసింది షేర్లను కాదు.. రూ.32కోట్ల విలువైన భూములనే. షేర్ల బదిలీకి, ఆయన బెయిల్ రద్దుకు ఎలాంటి సంబంధం లేదు. సొంత తల్లిని కోర్టుకు ఈడ్చడం.. ఆ తల్లికి ఎంత అవమానం? అమ్మను బాధపెట్టొద్దని.. అన్యాయంగా మాపై కేసు వేసిన సంగతి బయటపెట్టలేదు. కానీ కేసు వేసిన నెల రోజులకు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీని వెనుక జగన్ కారణమని ఎందుకు అనుకోకూడదు? నేను జగన్‌కు లేఖ రాస్తే.. అది తెదేపా సోషల్ మీడియా ఖాతాలో పోస్టయితే నాకేంటి సంబంధం? నేను కానీ.. నా మనుషులు కానీ బయటపెట్టలేదని బైబిల్‌పై ప్రమాణం చేస్తా. చంద్రబాబు చేతిలో బాణం కావాల్సిన అవసరం వైఎస్సార్ బిడ్డకు లేదు. జగన్ ఎవరి కొంగు చాటున ఉండి ఇదంతా చేస్తున్నారో అందరికీ తెలుసు. ఆస్తి, అధికారం కోసం ఇదంతా చేస్తున్నారని ప్రజలంతా గమనిస్తున్నారు. నా గురించి తెలియాలనే వాస్తవాలను మీ ముందు ఉంచుతున్నా. నేను మోసం చేసినట్లు, ఆస్తి కోసం అత్యాశ పడినట్లు భావించవద్దనే ఈ లేఖ రాశా. ఎంవోయూ నా చేతుల్లో ఐదేళ్లున్నా.. ఒక్క ఆస్తి కూడా ఇవ్వలేదు. ఏ ఒక్క మీడియా, కోర్టుకు ఎంవోయూ విషయాన్ని నేను బయటపెట్టలేదు. ఆర్థికంగా ఇబ్బంది పడినా కుటుంబ గౌరవం కోసం ఎంవోయూను బయటపెట్టలేదు. వైఎస్సార్ అభిమానులను మానసిక క్షోభకు గురిచేసిందెవరో మీకు తెలుసు. కుటుంబ బంధం, స్నేహబంధంతో మనుషులు ఒక్కటవుతారు. 'వైఎస్సార్ బంధం' ఏర్పరచుకున్న ప్రతి వైఎస్సార్ బంధువుకి వివరణ ఇస్తున్నా. అమ్మను, నన్ను తప్పుగా అర్థం చేసుకోవద్దనే వాస్తవాలు చెబుతున్నా'అని షర్మిల లేఖలో పేర్కొన్నారు.

# ఉచిత ఇసుక పాలసీ ఉత్తర్వులు జారీ

తనిఖీలకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. నిర్మాణ రంగంతో ఉపాధి ఆదాయం పెరుగుతున్నందున ఉచిత ఇసుక పూర్తిస్థాయిలో అమలుకు చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా సినరేజీ ఫీజు, మెరిట్ అన్ శాండ్ , డీఎంఎఫ్ మాఫీకి చర్యలు చేపట్టినట్టు ఉత్తర్వుల్లో ఏపీ ప్రభుత్వం వెల్లడించింది. ఇసుక అక్రమంగా తరలి పోకుండా జీపీఎస్. చెక్ పోస్టుల వద్ద పటిష్ట తనిఖీలకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉచిత ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ విధానం అమలు చేస్తుంది. దీనికి సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుక పోర్టల్‌ను అవిష్కరించారు. దీంతో గ్రామ వార్డు సచివాలయాల్లో ఇసుక బుక్ చేసుకునే అవకాశం ఉంది. అధికారుల నుంచి ఇసుక రవాణా దారుల వరకు ఎలాంటి తప్పులు చెయ్యకుండా పోర్టల్ రూపకల్పన చేశారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ అధికారుల నేతృత్వంలో కమిటీలు వేశారు. ఇసుక స్టాక్ ఎంత ఉంది... సరఫరా కేంద్రాలు ఎన్ని ఉన్నాయి.. అనే వివరాలతో పోర్టల్ రూపొందించారు. వేల చదరపు అడుగుల లోపు నిర్మాణాల వరకు సాధారణ బుకింగ్ పరిధిలో... 2వేల చదరపు అడుగులు మించితే బల్క్ విధానంలో బుకింగ్ చేసుకోవాలి. ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ పోర్టల్, యాప్‌ను అధికారులు సిద్ధం చేశారు. ఉచిత ఇసుక విధానం నేపథ్యంలో ఇసుక కావాల్సినవారు ఇంటి వద్ద నుంచే నేరుగా బుక్ చేసుకునేందుకు వీలుగా ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. కాగా..ఉచిత ఇసుక దారి మళ్లకుండా, ఇతరులు అధిక ధరలకు అమ్మకుండా నిఘా ఉంచేందుకు జిల్లాల వారీగా టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయనున్నారు. ఏ జిల్లాకు ఆ జిల్లా కలెక్టరే ఇందులోని అధికారులను నియమిస్తారు. గనులశాఖ, పోలీస్, ఎక్సైజ్, నీటిపారుదల, భూగర్భజలవనరులు.. తదితర శాఖల అధికారులతో కూడిన బృందం విస్తృతంగా తనిఖీలు చేయనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాత ఇసుక విధానాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. 2024 ఇసుక విధానం రూప కల్పన వరకూ సరఫరాకు మార్గదర్శకాలు జారీ చేసింది. 2019లో జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఇసుక విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. కొత్త ఇసుక విధానాన్ని తెచ్చే వరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి వరకు వినియోగదారుడికి ఉచితంగా ఇసుక ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జీవో నంబర్ 43ను జారీ చేసింది. వినియోగదారుడు ఎత్తుడు, దించుడు కూలీతో ఇతర చట్టబద్ధమైన పన్నులు చెల్లించాల్సి ఉంటుందని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొంది. 2024 కొత్త ఇసుక విధానాన్ని రూపొందించేంత వరకు కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్ర ఖజానాకు రెవెన్యూ లేకుండా ఇసుక సరఫరా జరపాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. వినియోగదారులకు ఇసుకను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ఇసుక సరఫరాపై మార్గదర్శకాల విడుదల చేసింది. ఇసుక తవ్వకాల నిమిత్తం జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటుకు సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. జిల్లా ఇసుక కమిటీల్లో జిల్లా ఎస్పీ, జేసీ సహా వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు ఉండనున్నారు. జిల్లాల్లోని స్టాక్ పాయింట్లను స్వాధీనం చేసుకోవాలని జిల్లా ఇసుక కమిటీలకు సర్కార్ సూచనలు చేసింది. 9 లక్షల మెట్రిక్ టన్నుల మేర ఇసుక రాష్ట్రంలోని వివిధ స్టాక్ పాయింట్లల్లో అందుబాటులో ఉందని ప్రభుత్వం వెల్లడించింది. ఇసుకను తిరిగి విక్రయించినా ఇతర రాష్ట్రాలకు తరలించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. భవన నిర్మాణ మినహా ఉచిత ఇసుకను మరే ఇతర అవసరాలకు వినియోగించొద్దని స్పష్టం చేసింది. ఇసుక అక్రమ రవాణా చేసినా, ఫిల్లింగ్ చేసినా పెనాల్టీలను నిర్ధారిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# సాగునీటి ప్రాజెక్టులో అత్యవసరపనులు

**మొదటిపేజీ తరువాయి..** అంగీకారం తెలిపారని అన్నారు. పంట కాలువలు, డ్రైన్లు, రిజర్వాయర్లు నిర్వహణకు అవసరమైన సిబ్బందిని అవుట్ సోర్సింగ్ మేనేజ్‌మెంట్ పద్ధతిన తీసుకోవాలని సీఎం సూచించారని అన్నారు. జగన్ ప్రభుత్వ అసమర్థ విధానాలు, నిర్వహణా లోపాల కారణంగా, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలోని మొత్తం 467 లిఫ్ట్ స్కీంలు మూలన పడ్డాయని, ఈ కారణంగా 2.90 లక్షల ఎకరాల సాగు తగ్గిందని అధికారులు వివరించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలో మొత్తం లిఫ్ట్ ఇరిగేషన్ కింద ఉన్న 8.11 లక్షల ఎకరాల సాగుకు అవసరమైన 1047 ఎత్తిపోతల పథకాల నిర్వహణ, రిపేర్ల కోసం పదేళ్లకు యాన్యుటీ పద్ధతిన ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు సూచించారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పంట కాలువలు, డ్రైనేజీలు, రిజర్వాయర్ల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని అవుట్ సోర్సింగ్ మేనేజ్‌మెంట్ పద్ధతిలో తీసుకోవాలని సీఎం సూచించారన్నారు. గత ప్రభుత్వ అసమర్థ పాలన, నిర్వహణ లోపాల కారణంగా.. ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలోని మొత్తం 467 లిఫ్ట్ స్కీంలు మూలన పడ్డాయనీ.. దీంతో 2.90 లక్షల ఎకరాల సాగు తగ్గిందని అధికారులు తెలిపారు.

## కానుకల రూపంలో శ్రీశైలం మల్లన్న దేవస్థానానికి రూ.2,58,56,737 కోట్ల ఆదాయం

**నంద్యాల 25 :**
నంద్యాల జిల్లా శ్రీశైలం మల్లన్న ఆలయంలో ఉభయ ఆలయాల హుండీ లెక్కింపు నిర్వహించారు. శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్ల ఉభయ ఆలయాలు, పరివార దేవాలయాల హుండీ లెక్కింపు నిర్వహించారు. చంద్రవతి కళ్యాణ మండపంలో పకడ్బందీగా ఈ లెక్కింపు నిర్వహించగా శ్రీశైలం మల్లన్న దేవస్థానానికి రూ.2,58,56,737 కోట్ల నగదు ఆదాయంగా లభించిందని ఇంఛార్జి ఈవో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ ఆదాయాన్ని గత 28 రోజులులో శ్రీ స్వామి అమ్మవార్లకు భక్తులు నగదును కానుకల రూపంలో సమర్పించినట్టు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ హుండీ లెక్కింపులో నగదుతో పాటు 379 గ్రాముల 500 మిల్లి గ్రాములు బంగారం అలానే వెండి 8 కేజీల 30 గ్రాములు లభించగా, నగదు బంగారుతో పాటు 1093 యూఏఈ దిర్హమ్స్, 21 యుఎస్ఏ డాలర్లు, 215 మలేషియా రింగిట్స్, 10 మారిటియస్ రూపాయలు, కెనడా డాలర్లు 20 యుకే పౌండ్సు, మాల్దీవ్స్ రుఫీయాస్ 10,ఈరోస్ 102-సింగపూర్ డాలర్లు, 25 ఈ హుండీ లెక్కింపులో లభించాయని ఆలయ ఇంఛార్జి ఈవో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. పటిష్టమైన నిఘా నేత్రాల మధ్య ఆలయ ఇంఛార్జి ఈవో చంద్రశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరగగా లెక్కింపులో దేవస్థానం అన్ని విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సోమశిల నుంచి శ్రీశైలం వరకు లాంచీ ప్రయాణం

**నాగర్‌కర్నూలు, అక్టోబర్25 :**
నల్లమల అటవీ ప్రాంతం, కొండకోనల మధ్య కృష్ణా నదిలో విహారానికి రాష్ట్ర పర్యాటకశాఖ సిద్ధమైంది. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు ఈ నెల 26 నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల నుంచి శ్రీశైలం వరకు లాంచీ ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. కొల్లాపూర్ మండలం సోమశిల తీరంలో ఒకేసారి 120 మంది ప్రయాణించేలా డబుల్ డెక్కర్ తరహాలో ఏసీ లాంచీని ఏర్పాటు చేశారు. కృష్ణా నదిలో సోమశిల నుంచి శ్రీశైలం వరకు (120 కి.మీ) 7 గంటలపాటు లాంచీ ప్రయాణం ఉంటుంది. ఈ లాంచీ ప్రయాణానికి పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1,600 టికెట్ ధర నిర్ణయించినట్లు సోమశిల లాంచీ ఇన్‌ఛార్జి శివకృష్ణ తెలిపారు.

# నేటినుంచి టిడిపి సభ్యత్వ నమోదు

## పార్టీ నేతలతో సిఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి,అక్టోబర్25:**
తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభం కానుంది. దీంతో కార్యక్రమం అమలుపై ఆ పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సమీక్షించారు. పార్టీని బలోపేతం చేయడం, నామినేటెడ్ పదవుల భర్తీపై ఉండవల్లిలోని తన నివాసంలో నేతలతో చర్చించారు. శనివారం నుంచి ప్రారంభమయ్యే తెదేపా సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో చేపట్టేలా తెదేపా ఏర్పాట్లు చేస్తోంది. రూ.100 సభ్యత్వంతో తెదేపా కార్యకర్తలకు రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా, వారి కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం, ఉపాధి కోసం సాయం అందించనున్నారు. అలాగే, రెండో దఫా నామినేటెడ్ పదవుల భర్తీపై ఉదయం నుంచి మూడు గంటల పాటు నేతలతో సీఎం చర్చించారు. సాధ్యమైనంత త్వరగా రెండో లిస్ట్ విడుదల చేసేలా కసరత్తు చేస్తున్నారు. మొదటి దశలో ఇచ్చిన 21 నామినేటెడ్ పదవులకు రెట్టింపు సంఖ్యలో రెండో జాబితా ఉంటుందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో కూటమి పక్షాలతోనూ చంద్రబాబు సంప్రదింపులు జరుపుతున్నారు. కష్టపడిన వారికే పదవి అనే విధానంలో భాగంగా నామినేటెడ్ పోస్టులకు ఎంపికపై చర్చించారు.

# తిరుమలను దర్శించుకున్న రామ్మోహన్‌నాయుడు

**అమరావతి,** అక్టోబర్ 25:
కేంద్ర పౌరవిమానాయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు శుక్రవారం తిరుమలను దర్శించుకున్నారు. తెల్లవారుజామున వీఐపీ దర్శన సమయంలో సతీసమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కేంద్ర మంత్రి రాక సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయం బయట మీడియాతో మంత్రి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గడిచిన నాలుగు నెలల్లో తిరుమల ను ప్రక్షాళన చేశామని, తిరుమలకు వచ్చే భక్తులు నేడు చాలా సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రం సమన్వయంతో రాష్ట్రం గాడిలో పడిందని అన్నారు. ఏపీని అభివృద్ధి చేసే దిశగా ప్రధాని మోదీ నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 9 కంపార్టుమెంట్లలో వేచియుండగా టోకెన్లు లేని భక్తులకు 6 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 61,004 మంది భక్తులు దర్శించుకోగా 20,173 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా రూ. 3.48 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

# తెలుగు పరిశ్రమ
# విజయవాడకు తరలిరావాలి

## రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్

**అమరావతి, అక్టోబర్ 25:**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుస్థిర పర్యాటకంపై దృష్టిసారిస్తోందని రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. రాష్ట్రంలోని ఏదైనా పర్యాటక ప్రాంతానికి వెళ్తే మూడు నాలుగు రోజులు అక్కడే ఉండేలా ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. విశాఖపట్నంలో సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన టూరిజం ట్రావెల్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో సినిమాల చిత్రీకరణలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. సినిమాల చిత్రీకరణ జరిగితే రెవెన్యూ పెరుగుతుందని మంత్రి చెప్పారు. టికెట్ల ధరలు పెంచాలని అడుగుతున్నారని, తెలుగు సినిమాలకు తప్పకుండా సహకారం అందిస్తామని, అంతకంటే ముందు చిత్ర పరిశ్రమ విజయవాడకు తరలివస్తే మరింత ఉపయుక్తంగా ఉంటుందని ఆయన అన్నారు. ఎక్కువ పెట్టుబడులు పెట్టే పరిస్థితుల్లో ప్రభుత్వం లేదని, అందుకే పీపీపీ విధానంపై దృష్టిపెడుతున్నామని తెలిపారు. అందరి సలహాలు తీసుకొని అందరికీ అనుకూలంగా ఉండేలా త్వరలో టూరిజం పాలసీ తీసుకొస్తామని చెప్పారు. స్వదేశీ దర్శన్, ప్రసాద్ పథకాల కింద రాష్ట్రానికి త్వరలో రూ.1000 కోట్లు కేటాయిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి దుర్గేశ్ చెప్పారు. రాష్ట్రంలో భారీ తీర ప్రాంతం ఉన్నా బ్లూ ఫాగ్ బీచ్ ఒక్కటే ఉందని అన్నారు. మిగిలిన బీచ్‌లను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తామని చెప్పారు. ఏపీలోని పర్యాటక ప్రాంతాలపై అందరూ కలసి ప్రచారం చేయాలని సూచించారు. రాష్ట్రంలో చిత్రీకరణ జరుగుతున్న ప్రాంతాల అసలైన పేర్లను సినిమాల్లో ప్రస్తావించాలన్నారు. అప్పుడే ఈ ప్రాంతాల గురించి అందరికీ తెలుస్తుందని అభిప్రాయపడ్డారు.

# జగన్ ఏదైనా చేయించగలడు

## ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

అమరావతి, అక్టోబర్ 25: వైఎస్సార్ కుటుంబంలో ఆస్తుల తగాదా రోజురోజుకూ ముదురుతుంది. వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్, అతడి చెల్లెలు ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మధ్య ఆస్తుల పంపకంపై బహిరంగ యుద్ధం జరుగుతుంది. ఈ సందర్భంగా వైఎస్సార్ అభిమానులు వాస్తవాలను గ్రహించాలంటూ మూడు పేజీల లేఖను శుక్రవారం విడుదల చేశారు. జగన్ ఏదైనా నమ్మించగలడంటూ లేఖను ప్రారంభించిన ఆమె వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బతికున్న కాలం నుంచి నేటి వరకు జరిగిన ఆస్తుల విషయంలో జరిగిన అంశాలను ఆమె ప్రస్తావించారు. రాజశేఖర్‌రెడ్డి స్థాపించిన అన్ని వ్యాపారాలు కుటుంబ వ్యాపారాలేనని, వాటికి జగన్‌మోహన్ రెడ్డి సొంతం కాదని, ఉన్న అన్ని కుటుంబ వ్యాపారాలకు జగన్ గార్డియన్ మాత్రమేనని స్పష్టం చేశారు.


# తెలుగు పరిశ్రమ విజయవాడకు తరలిరావాలి

## రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్

**అమరావతి, అక్టోబర్ 25:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుస్థిర పర్యాటకంపై దృష్టిసారిస్తోందని రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. రాష్ట్రంలోని ఏదైనా పర్యాటక ప్రాంతానికి వెళ్తే మూడు నాలుగు రోజులు అక్కడే ఉండేలా ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. విశాఖపట్నంలో సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన టూరిజం ట్రావెల్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో సినిమాల చిత్రీకరణలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. సినిమాల చిత్రీకరణ జరిగితే రెవెన్యూ పెరుగుతుందని మంత్రి చెప్పారు. టికెట్ల ధరలు పెంచాలని అడుగుతున్నారని, తెలుగు సినిమాలకు తప్పకుండా సహకారం అందిస్తామని, అంతకంటే ముందు చిత్ర పరిశ్రమ విజయవాడకు తరలివస్తే మరింత ఉపయుక్తంగా ఉంటుందని ఆయన అన్నారు. ఎక్కువ పెట్టుబడులు పెట్టే పరిస్థితుల్లో ప్రభుత్వం లేదని, అందుకే పీపీపీ విధానంపై దృష్టిపెడుతున్నామని తెలిపారు. అందరి సలహాలు తీసుకొని అందరికీ అనుకూలంగా ఉండేలా త్వరలో టూరిజం పాలసీ తీసుకొస్తామని చెప్పారు. స్వదేశీ దర్శన్, ప్రసాద్ పథకాల కింద రాష్ట్రానికి త్వరలో రూ.1000 కోట్లు కేటాయిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి దుర్గేశ్ చెప్పారు. రాష్ట్రంలో భారీ తీర ప్రాంతం ఉన్నా బ్లూ ఫాగ్ బీచ్ ఒక్కటే ఉందని అన్నారు. మిగిలిన బీచ్‌లను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తామని చెప్పారు. ఏపీలోని పర్యాటక ప్రాంతాలపై అందరూ కలసి ప్రచారం చేయాలని సూచించారు. రాష్ట్రంలో చిత్రీకరణ జరుగుతున్న ప్రాంతాల అసలైన పేర్లను సినిమాల్లో ప్రస్తావించాలన్నారు. అప్పుడే ఈ ప్రాంతాల గురించి అందరికీ తెలుస్తుందని అభిప్రాయపడ్డారు.


# ఒడిషాలో తీరం దాటిన దానా తుఫాన్
# తీరం వెంట 120 కి.మీ వేగంతో గాలులు

- గాలుల ధాటికి పలుచోట్ల నేలకూలిన చెట్లు
- తీరప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలు

**విశాఖపట్టణం,అక్టోబర్25:**
వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన 'దానా' తుపాను తీరం దాటింది. ఒడిశాలోని బిత్తర్‌కనిక జాతీయ పార్క్, ధమ్రా మధ్య గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ పక్రియ ప్రారంభమైనట్లు వాతావరణ శాఖ పేర్కొంది. శుక్రవారం ఉదయం వరకు ఇది కొనసాగి తుపాన్ బలహీనపడనుంది. తుపాను తీరం దాటే సమయంలో భద్రక్, కేంద్రపార జిల్లాల్లో గంటలకు 120 కి.మీ వేగంతో తీవ్రంగా గాలులు వీచాయి. గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు నేలకూలాయి. తుపాన్ ప్రభావంతో ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. విద్యా సంస్థలకు శుక్రవారం సెలవు ప్రకటించాలని అధికారులు రెండు రాష్ట్రాలకు సూచించారు. కోల్‌కతా, భువనేశ్వర్ ఎయిర్‌పోర్ట్‌ను గురువారం సాయంత్రం శుక్రవారం 9 గంటల వరకు మూసి ఉంచనున్నారు. రెండు రాష్ట్రాల్లో మొత్తం 400 రైళ్లను రద్దు చేశారు. అధికారులు తుపాను ప్రభావితమయ్యే ప్రాంతాలను నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే పక్రియ చేపట్టారు. తీవ్ర తుఫాన్ దానా .. శుక్రవారం తెల్లవారు జామున పూరి సమీపంలోని ధమ్రా– హబలి ఖాతి మధ్య ప్రాంతంలో తీరాన్ని దాటింది. దీంతో ఈ ప్రాంతంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. గంటకు వంద నుంచి నూట ఇరవై కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాళ్లు తీరం దాటి సమయంలో వీస్తున్నాయి. ఇప్పుడు పశ్చిమ వాయువ్య దిశగా కదులుతుంది... ఇది క్రమంగా బలహీనపడే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉత్తర ఒరిస్సా ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీని ప్రభావంతో ఉత్తరకొస్తా జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. శనివారం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కూడా అక్కడక్కడ వర్షాలు పడడానికి ఆస్కారం ఉంది. ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ మాట్లాడుతూ.. హబాలి ఖాతి నేచర్ క్యాంప్, ధమ్రాకు సమీపంలో తుపాన్ 'దానా' తీరం దాటిందని, రాత్రి 1:30 గంటల నుంచి శుక్రవారం తెల్లవారు జాము 3:30 గంటల మధ్య తీరం దాటిందన్నారు. ల్యాండ్‌ఫాల్ పక్రియ మరో 2–3 గంటల పాటు కొనసాగుతుందని, ఇది పశ్చిమ–వాయువ్య దిశగా కదులుతూ మధ్యాహ్నం నుంచి క్రమంగా బలహీన పడుతుందని, ఉత్తరాంధ్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రోణంకి కూర్మనాథ్ సూచించారు. మరోవైపు దానా తుపానుతో రాష్ట్రానికి ముప్పు తప్పింది. తూర్పు మధ్య బంగాళాఖాతంలోని తీవ్ర వాయుగుండం పశ్చిమ వాయవ్యంగా పయనించి బుధవారం నాటికి తుఫాన్‌గా బలపడింది. తరువాత వాయవ్యంగా గంటకు 12 కి.మీ. వేగంతో ప్రయాణిస్తూ రాత్రి 10 గంటలకు ఒడిసాలోని పారాదీప్‌కు 420 కి.మీ, ధామ్రాకు 450 కి.మీ, సాగర్ ద్వీపానికి (పశ్చిమ బెంగాల్) 500 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. దీనికి ఒమన్ దేశం సూచించిన 'దానా' అని పేరు పెట్టారు. తుఫాను వాయవ్యంగా పయనించే క్రమంలో తీవ్ర తుఫాన్‌గా బలపడి ఈరోజు ఉదయానికి వాయవ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించింది. ఈ క్రమంలో తీవ్ర తుఫాన్ ఒడిసాలో తీరం దాటిన నేపథ్యంలో ఏపీకి ప్రత్యేకించి ఉత్తరాంధ్రకు ముప్పు తప్పింది. తీరం దాటే సమయంలో ఉత్తరాంధ్రలో పలుచోట్ల చెదురుమదురు వర్షాలు మాత్రమే కురుస్తాయని ఐఎండీ తెలిపింది. ఉత్తరాంధ్ర తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున ఈనెల 26 వరకు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం హెచ్చరించింది. విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం ఓడరేవులలో రెండో నంబరు హెచ్చరిక ఎగురవేశారు. కళింగపట్నం, భీమునిపట్నం ఓడరేవులకు సమాచారం అందించారు.

# నెరవేరుతున్న ఏపీ ప్రజల ఆశలు
# కేంద్రం నుంచి భారీగా నిధులు

**అమరావతి (ఆర్ఎన్ఎ) 25:**
ఏపీ ప్రజల ఆశలు నెరవేరుతున్నాయి రాజధాని వాసుల కలలు చిగురిస్తున్నాయి. ప్రతి దాంట్లో ఏపీకి కేంద్రం నుంచి అగ్ర తాంబూళం అందుతోంది. అడిగిందే తడువుగా ఏపీకి నిధుల వరద పారిస్తోంది. ఒక్క రాజధానికే కాదు శ్రీకాకుళం నుంచి శ్రీకాళహస్తి వరకు అమలాపురం నుంచి అనంతపురం వరకు. నవ్యాంధ్ర నలుమూలలా అభివృద్ధి జరిగేలా భరోసా దక్కుతోంది. కేంద్రం సరైన సమయంలో సహకారం అందిస్తూ ఉండడంతో కీలక ప్రాజెక్టులు పట్టాలెక్కుతున్నాయి. రూ.2,245 కోట్లతో 57 కి.మీ. రైల్వేలైన్ నిర్మాణం తాజాగా అమరావతి రైల్వే అనుసంధానం ప్రాజెక్టుకు సెంట్రల్ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2 వేల 245 కోట్ల రూపాయలతో 57 కి.మీ అమరావతి రాజధానికి కొత్త రైల్వే లైన్ ఏర్పాటు కానుంది. అమరావతి నుంచి హైదరాబాద్, చెన్నై, కోల్‌కతాకు నేరుగా అనుసంధానం చేస్తూ కొత్త లైన్ నిర్మాణం జరగనుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా కృష్ణా నదిపై 3.2 కి.మీ పొడవైన వంతెన నిర్మాణం చేపట్టనున్నారు. ఇదే కాకుండా మరో గుడ్ న్యూస్ చెప్పింది కేంద్రం. ఏపీలో రహదారుల అభివృద్ధికి రూ.252.42 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపింది. శ్రీకాకుళం జిల్లా రణస్థలం వద్ద 6 వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్నట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. బడ్జెట్లో ఏపీకి రూ.15 వేల కోట్లు కేంద్రం తోడ్పాటుతో జవసత్వాలు పొంది.. అమరావతి మహా నగరంగా రూపుదిద్దుకుంటుందన్న ఆశలు మొలకెత్తుతున్నాయి. అమరావతి నిర్మాణానికి కేంద్రం భరోసా ఇవ్వడమే కాకుండా.. బడ్జెట్లో భారీగా రూ.15 వేల కోట్లు ప్రకటించింది. ఇవే కాకుండా, పోలవరంకు 12 వేల కోట్లు, కేపిటల్ ఇన్వెస్ట్మెంట్ కింద మౌలిక సదుపాయాల కల్పనకు 2400 కోట్లు, ఇండస్ట్రియల్ కారిడార్ పేరిట 5000 కోట్లు, 15 వ ఆర్థిక సంఘం నిధులు 1450 కోట్లు, విశాఖ, విజయవాడలలో మెట్రోలకు 40 వేల కోట్లకు అనుమతులు, ఏపీ అమరావతి నిర్మాణం కోసం ఏపీ సీఆర్డీయేకు 11వేల కోట్ల రుణం.. ఇలా ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తులకు వెనువెంటనే స్పందిస్తూ డబ్బులు కేటాయిస్తోంది కేంద్రం. ఇటీవల వరదలతో తీవ్రంగా నష్టపోయిన ఏపీని ఆదుకునేందుకు1,036 కోట్ల రూపాయల నిధులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో పోలవరం, విశాఖ, విజయవాడలో మెట్రో రైల్, అమరావతి లాంటివి విభజన హామీల్లో ఉన్నవే. కానీ గతంలో వీటికి కేంద్రం నుంచి పెద్దగా సహకారం లభించలేదు. కానీ ఇప్పుడు కేంద్రంలో చంద్రబాబుకు ఉన్న పరపతి వేరు. ఏపీ శాసిస్తే. కేంద్రం పాటించాలి అన్నట్లు పరిస్థితి మారింది. ఇటు నుంచి చంద్రబాబు రిక్వెస్ట్ సిగ్నల్‌కు కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్స్ వస్తున్నాయి. దీంతో 2027 టార్గెట్ చంద్రబాబు ముందుకు వెళ్తున్నారు. 2027లోపు రాష్ట్ర అభివృద్ధికి కావాల్సిన మరిన్ని నిధులు పొంది.. ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కసరత్తు చేస్తున్నారు. మొత్తంగా జరుగుతున్న పరిణామాలన్నీ శుభ పరిణామాలని అటు ప్రభుత్వం.. ఇటు ప్రజలు భావిస్తున్నారు.

# డయేరియా పరిస్థితిపై పురపాలక శాఖ మంత్రి నారాయణ సమీక్ష

## డయేరియా అదుపులో
## ఉందని కలెక్టర్ల వివరణ

**అమరావతి 25 :** పల్నాడు జిల్లా దాచేపల్లిలో డయేరియా పరిస్థితిపై పురపాలక శాఖ మంత్రి నారాయణ శుక్రవారం ఉదయం సమీక్ష సమావేశం నిర్వహించారు. పల్నాడు జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులతో మంత్రి మాట్లాడారు. ప్రస్తుతం దాచేపల్లిలో డయేరియా అదుపులోనే ఉందని మంత్రికి కలెక్టర్ చెప్పారు. కొత్తగా ఎలాంటి కేసులు నమోదు కాలేదని వెల్లడించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆరుగురి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యాధికారులు తెలిపారు. మరోవైపు స్థానికంగా ఉన్న బోర్లను మూసివేసి నగరపంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేస్తున్నారు. కాగా.. దాచేపల్లిలో నగర పంచాయతీలోని అంజనాపురం కాలనీలో డయేరియా ప్రభావం ఎక్కువగా ఉండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వ్యాధి తీవ్రతో ఇప్పటికే ఇద్దరు మృతువాత పడగా, 16 మంది వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న పరిస్థితి. అయితే కలుషిత మంచి నీరు తాగడం వల్లే అతిసారం ప్రబలిందని అధికారులు నిర్ధారించారు. తాగునీటి పైపు లైన్లు మురుగు కాలువలో ఉండటం వల్ల నీరు కలుషితమై ఉండవచ్చని భావిస్తున్నారు. డయేరియాతో డిగ్రీ విద్యార్థి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు (21), బండారు చిన వీరయ్య(63) మృతి చెందారు. వీరు ఇద్దరు మృతి చెందడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. డీఎంహెచ్‌వో డాక్టర్ రవి నేతృత్వంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి డయేరియా లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించి చికిత్స అందజేస్తున్నారు. కాలనీలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ శిరి గ్రామాన్ని సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కాలనీలో పరిస్థితిని సమీక్షించారు.

మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా దాచేపల్లి పరిస్థితిపై ఆరా తీసిన విషయం తెలిసిందే. డయేరియాతో ఇద్దరు చనిపోయిన విషయంపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడిన సీఎం.. డయేరియాకు కలుషిత నీరు కారణమా లేక.. వేరే కారణాలు ఏమన్నా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే దాచేపల్లిలో పరిస్థితిని ముఖ్యమంత్రికి కలెక్టర్ వివరించారు. బోర్లను మూసి వేసి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలంటూ సీఎం చంద్రబాబు ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు ఈరోజు స్థానికంగా ఉన్న బోర్లను మూసివేసిన నగరపంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

దుర్గమ్మ సేవలో మంత్రి నారాయణ

కాగా ఉదయం మంత్రి నారాయణ విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సంద్భంగా మంత్రికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితుల చేత వేద ఆశీర్వచనం పొందారు. అలాగే ఆలయ ఈవో కేఎస్ రామారావు అమ్మవారి లడ్డు ప్రసాదాన్ని , చిత్రపటాన్ని మంత్రి నారాయణకు అందించారు.

# ఉచిత సిలిండర్‌కు 29 నుంచి బుకింగ్స్

## పౌరసరఫరాలశాఖ
## మంత్రి నాదెండ్ల మనోహర్

**అమరావతి, అక్టోబర్ 25:** ఏపీ ప్రభుత్వం దీపావళి కానుకగా ప్రకటించిన ఉచిత సిలిండర్ పథకానికి ఈనెల 29 నుంచి బుకింగ్స్ చేసుకోవచ్చని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. ఈనెల 30న సీఎం చేతుల మీదుగా తొలి సిలిండర్‌ఇప్పిస్తామని పేర్కొన్నారు. గ్యాస్ కనెక్షన్‌కు అర్హత కలిగిన ఎల్పీజీ కనెక్షన్, తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు ఉండాలని సూచించారు. సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లోపు వారి ఖాతాల్లోకి డబ్బు జమ అవుతుందని , పథకం అందకపోతే టోల్‌ఫ్రీ నెంబర్ 1967 ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చని అన్నారు.ఈరోజే దీనికి సంబంధించిన ఉత్తర్వులు ఇస్తామని వివరించారు. అక్టోబర్ 31 నుంచి మార్చి 31 వరకు మొదటి సిలిండర్‌ను బుక్ చేసుకోవచ్చని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ కంపెనీలకు రూ. 894 కోట్లను సీఎం చేతుల మీదుగా అందించబోతున్నామని వెల్లడించారు. రెండో సిలిండర్ ఏప్రిల్ 1 నుంచి జులై 31 వరకు , ఆగస్టు 1 నుంచి డిసెంబర్ 31 వరకు మూడో సిలిండర్ కోసం బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. రాబోయే రోజుల్లో కొత్త రేషన్‌కార్డులు అందించబోతున్నామని, వాటి డిజైనింగ్ జరుగుతుందని తెలిపారు. కోటి 55 లక్షల కనెక్షన్‌లకు గ్యాస్ సిలిండర్‌లు పంపిణీ చేస్తున్నామని, వీటిలో కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం కేవలం 9 లక్షల 65 వేల సిలిండర్లు వస్తున్నాయని తెలిపారు.

# సినిమా చూసి నటుడిని కొట్టిన మహిళ



అంజన్ రామచంద్ర, శ్రావణి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం చిత్రం లవ్ రెడ్డి . గత వారం థియేటర్లలోకి వచ్చి మంచి ప్రేక్షకుల నుంచి సూపర్ పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. ముఖ్యంగా సినిమాలో హరో హీరోయిన్ల మధ్య కెమిస్ట్రీ, క్లైమాక్స్ మూవీ చూసిన ప్రతి ప్రేక్షకుడిని బాగా ఆకట్టుకున్నాయి. అయితే సినిమాకు అనుకున్నంత బజ్, ఓపెనింగ్స్ అభించకపోవడంతో బ్లాక్ బస్టర్ బట్ ఫెయిల్యర్ మీట్ అని ఈవెంట్ పెట్టి టాలీవుడ్‌లో హాట్ టాపిక్ అయ్యారు. సినిమా బావుందని చూసిన వారంతా చెబుతున్నారని కానీ ప్రేక్షకులను రీచ్ కావట్లేదంటూ తమ ఆవేదనను వెలిబుచ్చారు. ఈ పెయుల్యర్ ఈవెంట్ వార్త, టీమ్ అవేదన కాస్త వైరల్ అవడం.. ఈ విషయం మన రెబల్ స్టార్ ప్రభాస్ దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందించి తన సోషల్ మీడియాలో లవ్ రెడ్డి సినిమా రివ్యూస్ వింటున్నాను ఆల్ ది బెస్ట్ మేకర్స్ అని పోస్టు పెట్టడంతో సినిమాకు కాస్త మైలేజ్ కూడా దొరికింది. దీంతో సినిమా గురించి కొద్ది మందికి తెలిసి యూత్ అండ్ ఫ్యామిలీ ఆడియెన్స్ ఇప్పుడిప్పుడే లవ్‌రెడ్డి సినిమాను ఆదరిస్తున్నారు. ఈక్రమంలో లవ్ రెడ్డి సినిమాలో నటించిన నటులంతా సినిమా ఆడుతున్న థియేటర్లకు వెళ్లి స్వయంగా ప్రేక్షకుల స్పందనను తెలుసుకుంటున్నారు. ఈక్రమంలో థియేటర్స్ విజిట్‌కు హైదరాబాద్ నిజాంపేట జీపీఆర్ మాల్‌కు వెళ్లగా అక్కడ సినిమా క్లైమాక్స్ రన్ అవుతుంది. సరిగ్గా అదే సమయంలో ఆ థియేటర్‌లో సినిమా చూస్తున్న ఓ మహిళ హీరోయిన్‌కు, తండ్రి పాత్ర మధ్యలో వచ్చిన ఓ ఎమోషనల్ సన్నివేశాన్ని చూసి తట్టుకోలేక ఆగ్రహంతో అలాగే వెళ్లి అక్కడికి వచ్చిన తండ్రి పాత్రదారి రామస్వామిని నాలుగైదు దెబ్బలు వేసింది. పైగా షర్ట్ చిరిగింది. ఒక్కసారిగా జరిగిన ఈ హఠాత్ పరిణామంతో అక్కడికి వచ్చిన వారు భయభ్రాంతులకు గుయ్యారు. దీంతో వెంటనే తోటి నటులు అప్రమత్తం అయిన అతనిని కాపాడారు. ఇది కేవలం సినిమానే అని నిజం కాదంటూ సదరు మహిళకు నచ్చ చెప్పారు. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది.

# చిరంజీవికి అక్కినేని నాగార్జున ఆహ్వానం

## అక్టోబర్ 28న అవార్డు ప్రదాన కార్యక్రమం



మెగాస్టార్ చిరంజీవి అక్కినేని జాతీయ అవార్డుకు ఎంపికయ్యారని తెలిసిందే. అక్టోబర్ 28న అవార్డు ప్రదాన కార్యక్రమం జరుగనుంది. 2024 కార్యక్రమానికి ప్రముఖ బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో చిరంజీవికి ఆహ్వానం అందించాడు అక్కినేని నాగార్జున. చిరంజీవిని కలిసి అవార్డ్ సెర్మనీకి రావాల్సిందిగా ఆహ్వానపత్రికను అందించాడు నాగార్జున. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఆర్కే సినీ ప్లెక్స్‌లో ఏఎన్నార్ శత జయంతి వేడుకలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి నాగారు ్జనతో పాటు కుటుంబ సభ్యులు, ప్రముఖ దర్శకుడు రాఘవేంద్ర రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లా డుతూ.. రెండేళ్లకోసారి ఏఎన్నార్ అవార్డులు ఇస్తున్నామని.. ఈ సారి చిరంజీవికి ఇవ్వాలని నిర్ణయించు కున్నామని చెప్పాడు.

# నా విలువను పెంచదు..

# పీఆర్ ఏజెన్సీపై సాయి పల్లవి కామెంట్స్

ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న భామల్లో ఒకరు సాయి పల్లవి. ఈ బ్యూటీ నటిస్తోన్న సినిమాల్లో ఒకటి అమరన్. శివకార్తికేయన్ నటిస్తోన్న ఈ చిత్రం అక్టోబర్ 31న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది. సాధారణంగా బాలీవుడ్ సెలబ్రిటీలు తమ స్టార్‌డమ్, మార్కెట్‌ను పెంచుకునేందుకు పీఆర్ ఏజెన్సీలను పెట్టుకుంటారని తెలిసిందే. అమరన్ ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న సాయిపల్లవి బీటౌన్‌లో పీఆర్ మాఫియా గురించి చెప్పుకొచ్చింది. తన ఇమేజ్‌ను పెంచుకోవడానికి పీఆర్ ఏజెన్సీ ఆఫర్‌ను తిరస్కరించిందట సాయిపల్లవి. ఈ విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. బాలీవుడ్‌కి చెందిన ఓ వ్యక్తి ప్రొఫెషనల్‌గా నా ఇమేజ్‌ను మరింత పెంచుకునేందుకు ఏజెన్సీ అవసరమా..? అని అడిగాడు. అలా చేస్తే నేను లైమ్‌లైట్‌లో ఉంటా. అందరూ నా గురించి మాట్లాడతారని అతడు చెప్పాడు. నేను మాత్రం వద్దని చెప్పాను. ఎందుకంటే పీఆర్ ఏమీ ఇవ్వదు. అంతేకాదు పీఆర్ నా విలువను పెంచదు. నా గురించి తరచూ మాట్లాడితే జనాలకు విసుగు వస్తుంది. నేను ఖాళీ పబ్లిసిటీ కంటే నిజమైన అనుబంధానికి ఎక్కువ విలువ ఇస్తానని చెప్పుకొచ్చింది సాయిపల్లవి. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. సాయిపల్లవి మరోవైపు నాగచైతన్య హీరోగా నటిస్తోన్న తండేల్‌లో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఇందులో శ్రీకాకుళం అమ్మాయి సత్యగా కనిపించనుంది. హిందీలో రామాయణతోపాటు టైటిల్ ఫిక్స్ కాని మరో సినిమా కూడా చేస్తోంది.





# 15 ఏళ్లకే హీరోయిన్ ఎంట్రీ

# మొదటి సినిమానే ఓ సెన్సేషన్





సినీరంగుల ప్రపంచంలోకి బాలనటిగా అడుగుపెట్టి ఆ తర్వాత టాప్ హీరోయిన్ గా ఓ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. హిందీలో అనేక చిత్రాల్లో చైల్డ్ ఆర్టిస్టుగా మెరిసిన ఈ బ్యూటీ.. ఆ తర్వాత కథానాయికగా తొలి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఇంకేముంది తెలుగులో వరుస ఆఫర్స్ అందుకుంటూ మంచి పాపులారిటిని సంపాదించుకుంది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా.. టాలీవుడ్ ఇండస్ట్రీలో ఆ హీరో యిన్ చాలా స్పెషల్.. చైల్డ్ ఆర్టిస్టుగా తన నటనతో ప్రేక్షకులకు దగ్గరయ్యింది. ఆ తర్వాత కథానాయికగా బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. అందం, అభినయంతో తొలి సినిమాతోనే బాక్సాఫీస్ వద్ద సెన్సెషన్ అయ్యింది. దీంతో ఈ బ్యూటీకి తెలుగులో వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. కానీ ఆ తర్వాత మాత్రం ఈ బ్యూటీకి సరైన బ్రేక్ రాలేదు. దీంతో తెలుగులో ఆఫర్స్ తగ్గిపోయాయి. 15 ఏళ్లకే చిత్ర పరిశ్రమలో హీరో యిన్‌గా మెరిసిన ఆ తార ఎవరో తెలుసా.. తనే హన్సిక మోత్వా ని. అల్లు అర్జున్ నటించిన దేశ ముదురు సినిమాతో హీరోయిన్ గా వెండితెరకు పరిచయమైంది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో ఒక్కసారిగా హన్సిక పేరు మారుమోగింది. ఆ తర్వాత బ్యాక్ టూ బ్యాక్ ఆఫర్స్ అందుకుంది. స్టార్ స్టేటస్ రాకపోయినా జనం గుండెల్లో స్థానం సంపాదించుకుంది హన్సి క. ఆమె నటనకు టాలీవుడ్ ప్రేక్షకులు ఫిదా అయ్యారు. టాలీ వుడ్, కోలీవుడ్‌లో ఓ వెలుగు వెలిగిన ఈ ముద్దుగుమ్మ పలు హిట్ చిత్రాల్లో నటించింది. కానీ కొన్నాళ్లుగా ఈ బ్యూటీకి తెలు గులో ఆఫర్స్ రాలేదు. దీంతో కేవలం ఓటీటీలో పలు వెబ్ సిరీస్ చేస్తూ బిజీగా ఉంటుంది. కెరీర్ మధ్యలోనే తన స్నేహితుడి సోహైల్ ఖతురియాను వివాహం చేసుకుంది. పెళ్లి తర్వాత కొన్నాళ్లపాటు సినిమాలకు దూరంగా ఉన్న హన్సిక..సొంతంగా యూట్యూబ్ ఛానెల్ కూడా స్టార్ట్ చేసింది.. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ఎప్పటికప్పుడు తాజా ఫోటోలను, అభిమా నులతో పంచుకుంటుంది. మె షేర్ చేసిన కొన్ని ఫోటోలు వైరల్ అవుతున్నాయి. పెళ్లి తర్వాత హన్సిక తన లుక్‌ను పూర్తిగా మార్చుకుని మరింత అందంగా మారింది. గతంలో హన్సిక గురించి అనేక విమర్శలు వచ్చాయి. హన్సిక హార్మోజ్ ఇంజక్షన్ వేసుకుందని జోరుగా వార్తలు వచ్చాయి. కానీ వాటిపై క్లారిటీ ఇచ్చింది. నాపై వచ్చిన ఆరోపణలు నన్ను చాలా బాధించాయని హన్సిక తెలిపింది.

# రూ. 7.50 కోట్లతో లగ్జరీ కారు కొన్న రామ్‌చరణ్

పాన్ ఇండియా లెవల్లో అత్యధిక ఫాలోవర్స్ ఉన్న హీరోలలో రామ్ చరణ్ ఒకరు. కెరీర్ ఆరంభంలో ఎన్నో విమర్శలు ఎదుర్కొన్న చరణ్.. తనదైన నటనతో విమర్శకులను మెప్పించాడు. విభిన్న కథలను ఎంచుకుంటూ తెలుగులో టాప్ నటుల్లో ఒకరిగా ఎదిగారు. సినిమాల్లో నటించడమే కాకుండా... మంచి వ్యాపారవేత్తగా గుర్తింపు తెచ్చుకున్నాడు. తనకు కావాల్సింది ఏదైనా.. దక్కించుకునే రేంజ్‌కు ఎదిగాడు. ఇక ఈక్రమంలోనే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్.. ఓ బ్రాండ్ న్యూ లగ్జరీ కార్ కొన్నాడట. టాలీవుడ్‌లో ఇంత ఖరీదైన లగ్జరీ కారు మరెవరికీ లేదట. కార్లంటే చాలా ఇష్టపడే రామ్ చరణ్.. తాజాగా రోల్స్ రాయిస్ స్పెక్టర్‌ను కార్‌ను కొనుగోలు చేశారట. ఈ కారు ధర దాదాపు 7.50 కోట్ల రూపాయలు. ఇక ఈ స్పెక్టర్ కారు రోల్స్ రాయిస్ లోని ఇతర కార్ల కంటే డిజైన్, టెక్నాలజీ పరంగా చాలా అడ్వాన్స్ స్టేజ్‌లో ఉంటుంది. ఇక ఇప్పటికే చరణ్ గ్యారేజీలో అనేక కార్లు ఉన్నాయి. అలాగే సొంతంగా ప్రైవేట్ జెట్ కూడా కలిగి ఉన్నాడు. అంతేకాదు.. విమానయాన పరిశ్రమలో రామ్ చరణ్ భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టాడు. రామ్ చరణ్ సినిమా నిర్మాణంతో పాటు రియల్ ఎస్టేట్ రంగంలో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.